క్లుప్తంగా

ఏడీఈ, ఏఈలకు స్వాగతం



విద్యుత్ అధికారులను సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

చేవెళ్ల: విద్యుత్ శాఖలో జరిగిన బదిలీలలో చేవెళ్ల ఏడీఈ స్వామి, ఏఈ జానీమొయినొద్దీన్‌లు బదిలీ అయ్యారు. వారిస్థానంలో కొత్తగా ఏడీఈగా రాజేశ్‌బాబు, ఏఈగా రాజేందర్‌లు బదిలీపై వచ్చారు. బుధవారం ఏఈ రాజేందర్‌కు బదిలీ అయిన ఏఈ జానీమొయినొద్దీన్ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా చేవెళ్లకు చెందిన మైనార్టీ నాయకులు జానీమొయినొద్దీన్‌కు వీడ్కోలు చెప్పి శాలువాతో సన్మానించారు. కొత్తగా వచ్చిన ఏఈ రాజేందర్‌కు,ఏడీఈ రాజేశ్‌బాబులకు సన్మానం చేసి స్వాగతం తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఎండీ అహ్మద్, ఎండీ యాసిన్, ఖాలెద్, మహమూద్, జావేద్, శ్రీనివాస్‌రెడ్డి, ఉస్మాన్, గౌస్‌పాషా, అప్రోజ్‌లు ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌కు సన్మానం



అంగన్‌వాడీ టీచర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

కొందుర్గు: మండలంలోని ముట్పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ శారదమ్మకు ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. 33 ఏళ్లపాటు గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తూ విశేష సేవలందించడం ఎంతో గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు సన్మానం



మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

షాబాద్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జోగు వెంకటయ్యతో పాలు పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి, పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరం లాంటిందని, మహిళల సాధికారత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. త్వరలో మిగిలిన గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో అలీబాయ్, అన్వర్, రాంచంద్రయ్య, తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీ



బ్యాటరీ ట్రై సైకిళ్లు అందుకున్న దివ్యాంగులు

షాద్‌నగర్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌కు చెందిన అలింకో సంస్థ సహకారంతో వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్ మాట్లాడుతూ.. అంగవైకల్యం ఉన్న ఎంతో మంది నడవడానికి అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నడిచేందుకు కాళ్లు లేక బయటకు వెళ్లలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. వారి ఇబ్బందులను తొలగించేందుకే బ్యాటరీ ట్రై సైకిల్స్‌ను అందజేశామన్నారు. అనంతరం అలింకో సంస్థకు దివ్యాంగులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బాల్‌రాజ్, ఆంజనేయులు, శ్రీను, లక్ష్మయ్య, వనమ్మ, పల్లవి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

- ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖానా
- ఏడాదిన్నర క్రితమే నిర్మాణం పూర్తి
- కరెంట్ కనెక్షన్ లేదనే సాకుతో వృథాగా వదిలేసిన వైనం
- పట్టించుకోని అధికారులు



మొయినాబాద్: చిలుకూరులో ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖానా

మొయినాబాద్: ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని నిర్మించిన పల్లె దవాఖానా ప్రారంభానికి నోచుకోకపోవడంతో వృథాగా మారింది. భవన నిర్మాణం పూర్తయి ఏడాది దాటినా కరెంటు కనెక్షన్ ఇవ్వడం లేదనే సాకుతో అధికారులు దాటవేస్తు వస్తున్నారు. దీంతో ఏడాదిన్నర కాలంగా ప్రారంభానికి నోచుకోవడం లేదు. మండల పరిధిలోని చిలుకూరులో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ఉంది. కొన్నేళ్లుగా గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన ఓ చిన్న గదిలో సబ్‌సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. అయితే రెండున్నరేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం సబ్‌సెంటర్‌కు కొత్త భవనం నిర్మాణానికి 2022లో నిధులు మంజూరు చేసింది. చిలుకూరు బస్టాప్ పక్కనే విశాలమైన ప్రదేశంలో రూ.20లక్షలతో సబ్‌సెంటర్ భవన నిర్మాణాన్ని చేపట్టారు. భవన నిర్మాణం పూర్తయి సుమారు ఏడాదిన్నర దాటింది. కానీ ఇప్పటివరకు ప్రారంభించడం లేదు.

నిర్మాణం పూర్తయినా నిరుపయోగంగానే..

చిలుకూరులో పల్లె దవాఖానా పేరుతో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్ర భవనానికి కరెంట్, నీటి సరఫరా కనెక్షన్ ఇవ్వడం లేదు. అందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. భవన నిర్మాణం పూర్తయినా అందులో కరెంటు ఫిట్టింగ్ జరగలేదని, ఈ కారణంగానే భవనాన్ని ప్రారంభించలేకపోతున్నట్లు పేర్కొంటున్నారు. అయితే ఏడాది క్రితమే జిల్లా వైద్యాధికారి చిలుకూరు పల్లె దవాఖాన భవనాన్ని పరిశీలించారు. మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తిచేయించి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కానీ ఇంతవరకు దాన్ని పట్టించుకోలేదు. దీంతో రూ.లక్షలు ఖర్చుపెట్టి నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభానికి నోచుకోకుండా ప్రజలకు అందుబాటులోకి రాకుండా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి పల్లె దవాఖాన భవనాన్ని ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

అందుబాటులోకి తీసుకురావాలి

చిలుకూరులో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణం ఏడాది క్రితమే పూర్తయింది. కొన్ని చిన్న చిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయనే సాకుతో అధికారులు భవనాన్ని ప్రారంభించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

– జొన్నాడ రాజు, చిలుకూరు

కరెంట్, నీటి కనెక్షన్ లేదు

చిలుకూరులో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కానీ కరెంటు, నీటి కనెక్షన్ ఇవ్వలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులన్నీ పూర్తి చేయించి త్వరలో ప్రారంభించేందుకు కృషి చేస్తాం.

– అన్నపూర్ణ, మండల వైద్యాధికారి, మొయినాబాద్

సభ్యత్వ నమోదుకు స్పందన

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి



చందనవెల్లిలో సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న శ్రీధర్‌రెడ్డి, రాము

షాబాద్: బీజేపీ చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కందూరు శ్రీధర్‌రెడ్డి, స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఇంటింటికీ తిరిగి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ సభ్యత్వ నమోదును చేపడుతున్నట్లు చెప్పారు. దేశంలో బీజేపీని అతిపెద్ద రాజకీయ పార్టీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై నేడు యువకులు, మహిళలు పెద్ద ఎత్తున తమ పార్టీలో సభ్యత్వం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు మాణయ్య, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి కూతురు మహేందర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు మహేశ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు రవిగౌడ్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



నూతన సభ్యులతో యాదయ్య తదితరులు

తుర్కయంజాల్: ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు నిరంతరం పోరాటం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పగడాల యాదయ్య అన్నారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని చెప్పారు. బుధవారం కాలనీలో జరిగిన 6వ మహాసభల్లో నూతన కమిటీని నియమించామని ఆయన తెలిపారు. పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని నీలం సంజీవరెడ్డినగర్ నూతన శాఖ కార్యదర్శిగా జంగిలి ఆశీర్వాదం, సభ్యులుగా కొండిగారి శంకర్, నిమ్మ లక్ష్మయ్య, ఎస్.యాదగిరి, ఎం.చిన్నలను ఏకగ్రీవంగా ఎనుకున్నట్లు యాదయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మున్సిపాలిటీ బాధ్యుడు డి.కిషన్, నాయకులు ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

- బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కొత్త మాణిక్‌రెడ్డి



పాదయాత్ర ప్రారంభంలో పాల్గొన్న మాణిక్‌రెడ్డి తదితరులు

మొయినాబాద్ రూరల్: దైవచింతన కలిగి ఉన్నప్పుడే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తుందని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కొత్త మాణిక్‌రెడ్డి, రాష్ట్ర ఉపసర్పంచ్‌ల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే మండల పరిధిలోని అజీజ్‌నగర్ హనుమాన్ దేవాలయంలో 20 మంది అయ్యప్ప భక్తులు మాల ధరించి ఇరుముడులతో శబరిమలకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా అల్లం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో నాయకుడు కొత్త మాణిక్‌రెడ్డి పాల్గొని పాదయాత్రను ప్రారంభించారు. దీంతో అజీజ్‌నగర్‌లోని పలు వీధులు అయ్యప్ప నామస్మరణతో మార్మోగాయి. ప్రజలు, భక్తులు పాదయాత్రను భక్తిశ్రద్ధలతో తిలకించారు.

మొక్కజొన్న పంట పరిశీలన



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న సైంటిస్టులు

కేశంపేట: మండల పరిధిలోని అల్వాల క్లస్టర్‌లోని అల్వాల గ్రామ శివారులో రైతులు సాగుచేసిన మొక్కజొన్న చేను ఏపుగా పెరిగి, పంట లేకపోవడంతో రైతులు శ్రీశైలం, వెంకటేశ్, రవీందర్, చెన్నయ్య, మహేందర్, మల్లేశ్, పాండు ఇటీవల వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం నుంచి ప్రిన్సిపాల్, సైంటిస్టు డాక్టర్ నగేశ్, డాక్టర్ మల్లయ్య బుధవారం రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. పంటలు చేతికి వచ్చే సమయానికి మక్కకంకులు లేకపోవడంతో పంట నష్టం వాటిల్లినట్టు రైతులు సైంటిస్టులతో తెలిపారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని సరస్వతి ఆగ్రోస్, కేశంపేట గ్రామంలోని శ్రీనివాస ట్రేడర్స్, కిసాన్ ఆగ్రో ఎజెన్సీ వద్ద సిజింటా(6802) రకంను రైతులు కొనుగోలు చేశారు. పంటలను పరిశీలించిన సైంటిస్టులు నివేదికను అధికారులకు అందిస్తామని తెలిపినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సురేశ్‌రెడ్డి, ఏడీఏ రాజరాత్నం, మండల వ్యవసాయ అధికారి శిరీష, మండల వ్యవసాయ విస్తరణ అధికారి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలు తొలగించాలని వినతి

- మద్యం అమ్మొద్దని గ్రామస్తుల తీర్మానం



మద్యం అమ్మొద్దని తీర్మానం చేస్తున్న గ్రామస్తులు

షాద్‌నగర్‌రూరల్: గ్రామంలో మద్యం ఏరులై పారుతోంది.. చిన్నా పెద్ద తేడా లేకుండా మద్యానికి బానిసలు అవుతున్నారు.. బెల్టు షాపులను మూసివేయాలని కోరుతూ ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని గంట్లవెల్లి గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో తీర్మానం చేశారు. గ్రామంలో మద్యం దుకాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం గ్రామస్తులు ఎక్సైజ్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలోని బెల్టు దుకాణాల నిర్వాహకులు ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు మద్యం విక్రయిస్తున్నారన్నారు. దీంతో గ్రామంలో పెద్దలు, యువకులు అనే తేడా లేకుండా మద్యానికి బానిసలవుతున్నారని, గ్రామంలో అనేక కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. బెల్టు దుకాణాలు తొలగించకపోతే మరిన్ని కుటుంబాలు రోడ్డునపడే పరిస్థితి వస్తుందన్నారు. గ్రామంలోని కిరాణా షాపుల్లో అక్రమంగా మద్యం అమ్ముతున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు తదితరులు ఉన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు అవమానం

- అంబేద్కర్ విగ్రహానికి బురద చల్లిన వారిని శిక్షించాలి
- ప్రజా సంఘాల నేతల ఆందోళన
- క్షీరాభిషేకం చేసిన సీఐ, ఏసీపీ



అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఏసీపీ రాజు, సీఐ శంకర్‌కుమార్

యాచారం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై బురద చల్లిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్, ఎమ్మార్పీఎస్, రాజకీయ పక్షాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రంగారెడ్డి– నల్గొండ జిల్లాల సరిహద్దు మాల్ కూడలిలో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బురద చల్లారని, వెంటనే వారిని గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమాచారం అందుకున్న సీఐ శంకర్‌నాయక్, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజుమాల్‌కు చేరుకొని నిరసనకారులకు నచ్చజెప్పారు. బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అనంతరం ఏసీపీ, సీఐలు అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళుర్పించారు. నాయకుల ఫిర్యాదుమేరకు పోలీసులు సాగర్, మద్రిగూడ రోడ్డుపై ఉన్న సీసీకెమెరాలను పరిశీలిస్తున్నారు.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరి



షాబాద్: కుమ్మరిగూడలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది



కొత్తూరు: పశువులకు టీకాలు వేస్తున్న వైద్యురాలు

కొత్తూరు మండల పశువైద్యురాలు స్ఫూర్తి

కొత్తూరు: పశువుల పెంపకంలో కాపరులు, రైతులు తగిన జాగ్రత్తలు వహించాలని మండల పశువైద్యురాలు స్ఫూర్తి సూచించారు. మండలంలోని పెంజర్ల గ్రామంలో బుధవారం పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 448 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం వైద్యురాలు మాట్లాడుతూ.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తోడు పశువుల్లో తరచూ వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువులు అనారోగ్యాలకు గురైతే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా చికిత్సలు చేయించాలన్నారు. పశువులు, పాడి పరిశ్రమల నిర్వహణలో రైతులు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణ, జ్యోతి, రవి, రాజ్‌కుమార్, పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

షాబాద్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యులు స్రవంతి, చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గాలికుంటు సోకిన పశువులకు నోట్లో, గిట్టల్లో పుండ్లు అయి జ్వరంతో మేతమేయవని, పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుందన్నారు. అదేవిధంగా ఎడ్లు, దున్నపోతులు మేతమేయక అనారోగ్యంతో చివరకు చనిపోతాయని తెలిపారు. రైతులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పక వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

సకాలంలో చికిత్స అందించాలి

శంకర్‌పల్లి: పశువులకు సకాలంలో సరైన చికిత్స, మందులు అందించడంతో వ్యాధి నివారణతో పాటు, వ్యాధి వ్యాప్తి సైతం అరికట్టవచ్చని మహారాజ్‌పేట్ పశు వైద్యశాల డాక్టర్ మానస అన్నారు. బుధవారం మండలంలోని మహారాజ్‌పేట్, జన్వాడ గ్రామాల్లో గాలికుంటు నివారణ టీకాలను అందించారు. డాక్టర్ మానస మాట్లాడుతూ.. మూగ జీవాలను ఎప్పటికప్పుడూ పరిశీలించాలని, ఎదైనా సమస్య ఎదురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జేపీఓ శ్వేత, ఎల్‌ఎస్‌ఏ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభం



రహదారి అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట నుంచి షాబాద్ మండలం సర్దార్‌నగర్‌కు వెళ్లే రోడ్డు అభివృద్ధి పనులను నాయకులు బుధవారం ప్రారంభించారు. ప్రతీ మంగళవారం సర్దార్‌నగర్‌లో పశువుల సంత, వ్యవసాయ మార్కెట్, గంజ్ నిర్వహిస్తారని, సర్దార్‌నగర్‌కు వెళ్లేందుకు దారి సక్రమంగా లేకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని నాయకులు తెలిపారు. రోడ్డు అభివృద్ధి విషయంపై స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కోరిన వెంటనే ఆయన సానుకూలంగా స్పందించడంతో పనులను ప్రారంభించామన్నారు. రహదారిని బాగు చేయడంతో ఎంతోమంది రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యేకు నాయకులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు బద్దుల మల్లయ్యయాదవ్, గున్న భీమయ్య యాదవ్, బెంది మోహన్‌రెడ్డి, రాంరెడ్డి, చంద్రయ్య, సంజీవయ్య, యాదయ్యయాదవ్, భీమయ్య, శ్రీశైలం, మల్లయ్య, యూసుఫ్, శ్రీను, ఆజం, యాదగిరి, మక్బూల్, యాదయ్య, జహంగీర్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు

- జాయినింగ్ ఆర్డర్లు అందించిన మండల అధికారులు



కేశంపేట: మండలానికి కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులతో ఎంఈఓ చంద్రశేఖర్



చేవెళ్ల: ఉపాధ్యాయులకు జాయినింగ్ ఆర్డర్లను అందిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

చేవెళ్ల: ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన డీఎస్సీ 2024లో ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు పొందిన వారిలో 10 మందిని చేవెళ్ల మండలానికి కేటాయించినట్లు ఎంపీడీఓ హిమబిందు, ఎంఈఓ పురన్‌దాస్‌లు తెలిపారు. మండలానికి వచ్చిన నూతన ఉపాధ్యాయులకు జాయినింగ్ ఆర్డర్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల మండలానికి సంబంధించి 10 మంది ఉపాధ్యాయులలో 5 మంది ఎస్‌జీటీలు, 5 మంది స్కూల్ అసిస్టెంట్‌లను కేటాయించినట్లు తెలిపారు. వీరు బుధవారం మండల విద్యావనరుల కేంద్రంలో జాయినింగ్ కావటంతో వారికి ఆర్డర్లు అందజేసినట్లు చెప్పారు. 10 మందిలో 9 మంది వచ్చారని ఒకరు గురువారం రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునీర్‌పాషా, టీయూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి దయానంద్, ఉపాధ్యాయుడు వెంకటయ్య, సీఆర్పీలు కిష్టయ్య, శ్రీనివాస్, శంకర్ ఉన్నారు.

కొందుర్గు మండలంలో 25 మంది..

కొందుర్గు: ప్రభుత్వం కొత్తగా నియమించిన ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మండలంలో కొత్తగా 25 మంది ఎస్‌జీటీలు విధుల్లో చేరారని ఎంఈఓ గాయత్రి తెలిపారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 40 మంది ఎస్‌జీటీలు, 6 మంది స్కూల్ అసిస్టెంట్లు, ముగ్గురు పండిట్‌లు, ఒక పీఈటీ విధుల్లో చేరినట్లు ఎంఈఓ కిరణ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలి

కేశంపేట: ఉపాధ్యాయులు విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభను కనబర్చాలని మండల విద్యా ధికారి చంద్రశేఖర్ అన్నారు. డీఎస్సీలో ఉద్యోగాలు సాధించి మండలానికి కొత్తగా వచ్చిన 29 మంది ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాధికారి చంద్రశేఖర్ నూతన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలన్నారు. విద్యార్థులకు చక్కగా పాఠాలను బోధించి అందరి మన్నలను పొందాలని సూచించారు. అనంతరం వారికి కేటాయించిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం గతంలో బదిలీలు జరిగి ఉపాధ్యాయుల కొరతతో రిలీవ్ కాని ఉపాధ్యాయులు మధ్యాహ్నం తర్వాత రిలీవ్ అయిన వారికి కేటాయించిన పాఠశాలలకు వెళ్లారు.